క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని ఈఓఎస్‌లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. అనంతరం స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయలను తీసుకువెళ్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం, శుక్రవారం ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి కుంభోత్సవ జరపడం సంప్రదాయం. ఈ ఏడాది ఏప్రిల్ 11న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాధికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొత్తపల్లి: పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని కొంత మంది డబ్బు సంపదానే ధ్యేయంగా యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అదే తరహాలో మంగళవారం రేషన్ బియ్యాన్ని సేకరించి ఓ ఇంట్లో నిల్వ ఉంచగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మండలంలోని ముసలిమడుగు గ్రామంలో నాగలక్ష్మయ్య అనే వ్యక్తి సుమారు 40 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని పోగు చేసుకొని వేరే ప్రాంతానికి తరలించేందుకు ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇంట్లో సోదాలు చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్టేషన్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు

పగిడ్యాల: సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామ ని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు గ్రామాల్లో చోటుచేసుకున్న నీటి మునక భూముల వ్యవహారంపై వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత అంటూ పోస్టులు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆ కేసులో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి, బైండోవర్ చేశామని చెప్పారు.

మెరుగైన వైద్యం అందించాలి



వసతులపై చర్చిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

పగిడ్యాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి సూచించారు. మంగళవారం తూర్పు ప్రాతకోట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఎంపీపీ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి మంజూరైన రూ. 1.70 లక్షలతో రోగులకు అవసరమైన సదుపాయాల కల్పనకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, వైద్యాధికారి కృష్ణమూర్తి, ఈఓఆర్డీ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు తప్పిన ప్రాణాపాయం

పగిడ్యాల: మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన పశువులకు ప్రాణాపాయం తప్పిందని పడమర ప్రాతకోట పశువైద్యుడు మండ్ల సుమన్ తెలిపారు. మంగళవారం బాధిత రైతు తెలుగు శేఖర్ డాక్టర్ వైఎస్సార్ పశువైద్య సంచార వాహనం 1962 కాల్ సెంటర్‌కు సమాచారం అందించారు. ఆ మేరకు వైద్యులు పగిడ్యాలకు చేరుకుని గాయపడిన పశువులకు వైద్యం అందించారు. స్పష్టం చేశారు. మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి పశువులకు 5 రోజులకు సరిపడా మందులకు ఆర్థిక చేయూతను అందించారు.

చలివేంద్రం ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో మంగళవారం సర్పంచు మశమ్మ, ఎంపీటీసీ స్రవంతిల ఆధ్వర్యంలో సచివాలయ పంచాయతీ కార్యదర్శి నాగర్జున చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కాలం ప్రారంభం కావడం, ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండడంతో చలివేంద్ర ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చల్లని ఉపశమనం

- వేసవి తాపం తీరుస్తున్న పానీయాలు
- అందుబాటులో సహజసిద్ధమైన కొబ్బరి నీళ్లు, చెరుకు రసం
- రసాయనాలు కలపకుండా పండ్ల రసాల విక్రయం

నందికొట్కూరు: ఏప్రిల్ నెలలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటేశాయి. నందికొట్కూరు పట్టణంలో 43.1 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. ఉదయం నుంచి ఎండ ప్రభావం కనిపించడంతో అత్యవసర పనులపై బయటకు వెళ్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు నీళ్లు తీసుకెళ్లినా గంట, రెండు గంటల్లోనే ఖాళీ అవుతున్నాయి. ఆ తరువాత గొంతు తడుపుకునేందుకు దిక్కులు చూడకుండా పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు, కాలనీల వెంట శీతల పానియాల కేంద్రాలు వెలిశాయి. వేసవి తాపం నుంచి ప్రజలకు సహజ సిద్ధమైన చల్లని పానీయాలు ఉపశమనం కలిగిస్తున్నాయి. ప్రయాణంతో కూడిన విధులు నిర్వర్తించేవారు చెరకు రసం, నిమ్మరసం, కొబ్బరి నీళ్లను ఆశ్రయిస్తున్నారు.

డీహైడ్రేషన్ నుంచి రక్షణ

వేసవి కాలంలో డీహైడ్రేషన్ తగ్గించడానికి పానియాలు ఎంతగానో దోహదపడతాయి. అయితే రసాయనాలు కలపని ప్రకృతి సిద్ధంగా లభించే పానియాలు సేవిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా నిమ్మ రసం, చెరకు రసం, కొబ్బరి నీళ్లు డీహైడ్రేషన్ నుంచి రక్షణ కల్పిస్తాయి. రహదారుల వెంట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జ్యూస్ పాయింట్లలో తాజా పండ్ల నుంచి తీసిన రసాన్ని విక్రయిస్తున్నారు. నిమ్మ, పూదీన కలిపిన జ్యూస్, ఆరెంజ్ జ్యూస్, ఆరెంజ్ స్పోర్ట్స్ జ్యూస్, దానిమ్మ రసం, పుచ్చకాయ జ్యూస్, యాపిల్ జ్యూస్ వంటివి అందుబాటులో ఉన్నాయి. అలాగే అప్పటికప్పుడు నిమ్మరసం, చెరుకు రసం తీసిచ్చేందుకు రహదారుల వెంట దుకాణాలు వెలిశాయి. కూల్‌డ్రిక్స్‌తో పోల్చుకుంటే తక్కువ ధర కావడం, సహజసిద్ధమైన పానియాలు కావడంతో గిరాకీ కూడా బాగానే ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

వడదెబ్బ బారిన పడకుండా

వేసవి వేడికి వడదెబ్బకు గరవుతుంటారు. వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే ప్రధానంగా శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. వేసవిలో రోగ నిరోధక శక్తినిచ్చే పానియాల్లో ప్రాధానమైనది మజ్జిగ, లస్సీ ఈ పానియం సేవించడం ద్వారా జీర్ణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. ఎండ తీవ్రతతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు పట్టణాల్లో, గ్రామాల్లో ఉచితంగా మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే మామిడి పండ్ల రసం, ఆకుకూరలతో కూడిన రసాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.



కొబ్బరి బోండాం తాగుతున్న వ్యక్తి

విక్రయాలు పెరిగాయి



వేసవిలో చెరుకు రసం విక్రయాలు ఎక్కువగా పెరిగాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే చెరుకు రసం తాగేందుకు ప్రజలు ఎక్కువగా వస్తున్నారు. ఒక గ్లాసు రూ.10 చొప్పున్న అమ్ముతున్నాం. చెరుకు రసం విక్రయాలతో ఉపాధి పొందుతున్నా. రోజువారీ కూలి గిట్టుబాటు అవుతుంది.

– దేవా, శీతల పానీయాల విక్రదారుడు

ఎండ నుంచి రక్షించుకునేందుకు



ఎండలోనే ఎక్కువగా తిరుగుతుంటాం. మెకానికల్ పని చేస్తూ తిరుగుతూ ఎండకు ఇబ్బంది పడుతుంటాం. రక్షణ కోసం శీతల పానీయాలు తరుచూ సేవిస్తుంటాం. నిమ్మ రసం, చెరుకు రసానికి అధిక ప్రాధాన్యత ఇస్తాను. ఎక్కువ నీరసం ఉంటే కొబ్బరి నీళ్లు తాగుతా.

– రాజు, మోటారు మెకానికల్

నీరసపడకుండా



వృత్తిరీత్యా ఎండలో డ్రైవింగ్ చేయక తప్పదు. అత్యధిక ఎండలు పెరగడంతో ఇంజిన్ వేడికి, ఎండ ప్రభావంతో నీరసపడుతున్నాం. నీరసానికి గురికాకుండా రహదారుల వెంట అమ్ముతున్న శీతల పానియాలు చెరుకు రసం, కొబ్బరి నీళ్లు తాగుతూ డ్రైవింగ్ చేస్తున్నా.

– వైడీఆర్ స్వామి, ఆర్టీసీ డ్రైవర్

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

కొత్తపల్లి: గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ కవిత సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభమైనందున గ్రామాలలో ప్రజలకు నీటి సమస్యలేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో ఆరా తీస్తూ వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఈఓఆర్డీ శ్రీనివాసనాయుడు, పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా'

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం అనురాధ మంగళవారం తెలిపారు. మండలంలో 768 పొదుపు గ్రూపులు ఉన్నాయని, 7,695 సభ్యులున్నారని వారికి రూ.4.95కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముఖ్య అతిథిగా హాజరై చెక్కు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమానికి పొదుపు గ్రూపు సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు

నందికొట్కూరు: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ మేనేజర్ బేబి అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 8, 20, 21, 28వ వార్డులకు చెందిన 124 పొదుపు సంఘాలకు రూ.85,74,930 ఆసరా చెక్కు పంపిణీ చేశారు. పొదుపు మహిళలు సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ.. పొదుపు ఖాతాల్లో మూడోవ విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధులును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. ప్రతి ఏటా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు హమీద్, పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల, మెప్మా సీఎంఎం శాంతకుమారి, సీఓలు వినయ్‌కుమార్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ముంపు భూములు ఎవరి సొత్తూ కాదు

పగిడ్యాల: శ్రీశైలం రిజర్వాయర్ కింద ముంపునకు గురైన భూములు ఎవరి సొత్తూ కాదని వాటిపై ప్రభుత్వానికి తప్పా ఎవరికీ అధికారం లేదని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.దాసు తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్డీఓ పీకే ప్రాగటూరుకు చేరుకుని గ్రామస్తులతో బహిరంగ విచారణ చేపట్టారు. గత నాలుగు రోజులుగా ముంపు భూముల కోసం పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్ గ్రామస్తుల మధ్య తలెత్తిన వివాదం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. ఘర్షణలకు పాల్పడితే మునక భూముల్లో ఎవరూ వెళ్లకుండా 145 సెక్షన్‌ను విధిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పరిహారం చెల్లించడం వలన ఆ భూములపై శ్రీశైలం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు అధికారం ఉందని, వారికి లెటర్ పెట్టాలని తహసీల్దార్ భారతిని ఆదేశించారు. ఆయన వెంట ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ శ్వేత తదితరులు ఉన్నారు.



పీకే ప్రాగటూరు గ్రామస్తులను విచారిస్తున్న ఆర్డీఓ దాసు

ఆధునిక పద్ధతులు పాటించండి

జూపాడుబంగ్లా: రైతులు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులు పాటించాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం మండ్లెం గ్రామంలో రెండు రైతుమిత్ర గ్రూపులకు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సరోజమ్మతో కలిసి యంత్రపరికరాలను అందజేశారు.

వివాదాస్పద బోర్లపై వాల్టాచట్టం కమిటీ విచారణ

జూపాడుబంగ్లా: మండలంలోని 35బొల్లవరం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 1బీ/2ఏకు సంబంధించి వివాదస్పదమైన బోర్ల విషయమై హైకోర్టు ఉత్తర్వుల మేరకు వాల్టా కమిటీ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. వాల్టా కమిటీ సభ్యులైన ఆర్డీఓ ఎం దాసు, జియాలజిస్టు డిప్యూటీ డైరెక్టర్ రఘునాథన్, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, ఏఓ కృష్ణారెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసులు, ఏడీ రామాచారి విచారణ చేపట్టారు. హైకోర్టును ఆశ్రయించిన ఇరువురు బాధితులను పిలిపించిన అధికారులు వారి నుంచి వివరాలు సేకరించారు. ఇరువురి వాదోపవాదాలు విన్న అధికారులు తమ విచారణలో వెల్లడైన విషయాలను త్వరలో హైకోర్టుకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్‌ఐ జయన్న, డీటీ నాగన్న, కేసీ కాల్వ వర్క్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ రూరల్ మార్ట్ వాహనం అందజేత

వెలుగోడు: మండల చేప ఉత్పత్తిదారుల కంపెనీకి మంజూరైన 1.3 టన్నుల కెపాసిటీ గల మొబైల్ రూరల్ మార్ట్ వాహనాన్ని జిల్లా నాబార్డు డీడీఎం పార్థవ అందజేశారు. మంగళవారం బోయరేవుల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ వాహనాన్ని అందజేశారు. డీడీఎం మాట్లాడుతూ..ఈ వాహనాన్ని నాబార్డు మూలధనం 65 శాతం, ఎఫ్‌పీవో నుంచి 35 శాతం నిధులతో కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ వాహనం ద్వారా 518 మంది మత్స్యకారులు తాము పండించిన పంటను మార్కెట్‌కు చేర్చుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ద సోమన్న, నవయత్ అసోసియేషన్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, కేడీసీసీ మేనేజర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కానుకతో పేదలకు ఆర్థిక భరోసా

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆత్మకూరు డీఎల్‌పీఓ కవిత, ఎంపీడీఓ మేరి అన్నారు. మంగళవారం నందికుంట గ్రామంలో ఏప్రిల్ నెల వైఎస్సార్ పింఛన్ కానుకను పంపిణీ చేశారు. మండలంలో 4,222 మంది లబ్ధిదారులు ఉండగా తొలిరోజు 2,142 మందికి గ్రామవలంటీర్లు పింఛన్ పంపిణీ చేశారన్నారు. మండలంలో 51 శాతం పింఛన్ పంపిణీ పూర్తిఅయిందన్నారు. మిగిలిన లబ్ధిదారులకు త్వరలో పూర్తిచేస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మిడుతూరు: అర్హులందరికీ సంక్షేమపథకాలు అందిస్తున్నమని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని జలకనూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి, పంచాయతీ కార్యదర్శి హసీనా తదితరులు పాల్గొన్నారు.



పడమర ప్రాతకోటలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

66.34 శాతం పంపిణీ పూర్తి

పగిడ్యాల: మంగళవారం మండల వ్యాప్తంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ 66.34 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మండలంలోని పది గ్రామ సచివాలయ పరిధిలోని 4,835 మంది పింఛన్‌దారుల్లో మొదటి రోజు 3,215 మందికి వలంటీర్లు నగదును అందించారన్నారు. ఇంకా మిగిలిన లబ్ధిదారులకు రెండు రోజుల్లో పంపిణీని పూర్తి చేస్తాన్నారు. పడమర ప్రాతకోటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం చేయాలి



బోయరేవులలో జగనన్నే మా భవిష్యత్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 7 నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో గుంతకందాల, బోయరేవుల, అబ్దుల్లాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దేశం తిరుపంరెడ్డి మాట్లాడుతూ..జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లతో పాటు గృహసారథులు ప్రజలతో మమేకమవుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, నాయకులు ముంతల విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తర్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ జాతరలో ఎలాంటి దొంగతనాలు, అల్లర్లు జరగకుండా 50మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొంత మంది పోలీసులు మఫ్టీలో ఉంటూ దొంగతనాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచుతారని చెప్పారు. అలాగే జాతరకు వచ్చే వారు నగదు, బంగారు ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఎవ్వరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే జాతరలోని అవుట్‌పోస్టు పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, లేదా సెల్‌ఫోన్లలో వారి చిత్రాలను తీసి పోలీసులకు పంపిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఊరిబయటే వాహనాల పార్కింగ్

ఆటోలు, ద్విచక్రవాహనాలు, ప్రైవేటు వాహనాలేవీ జాతరలోకి రాకుండా ఊరిబయటనే ఆటో, బైక్‌స్టాండు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే జాతరలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆర్టీసి బస్సులు, ఎద్దులబండ్లు, సరుకులు తెచ్చే వాహనాలు అన్నీ బైపాస్ రోడ్డు వెంట మాత్రమే జాతరలోకి వచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. తర్తూరు జాతరలోకి అవుట్‌పోస్టు పోలీసుస్టేషన్‌లో నిరంతరం పోలీసులు భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు సీఐ సూచించారు.



ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్‌ఐ జయన్నలకు సూచిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, తదితరులు

రథోత్సవానికి పటిష్టబందోబస్తు

బుధవారం జరగనున్న రథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి తోపులాట, తొక్కిసలాట, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఇద్దరు సీఐలు, ఏడుమంది ఎస్‌ఐలు, 50మంది సివిల్ పోలీసులు, 50మంది స్పెషల్‌పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఐ వెంట ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్‌ఐ జయన్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

6 నుంచి బండలాగుడు పోటీలు

రైతన్నల జాతరగా పేరొందిన తర్తూరు జాతరలో ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు అంతర్‌రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దాసిసుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం వారు తర్తూరులో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 6న సీనియర్స్ విభాగంలో పెద్దబండ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, 20వేలు, రూ.10వేల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 5వతేదీ సాయంత్రంలోగా రూ.800ల ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

7న న్యూకెటగిరీ విభాగం

7వ తేదీన న్యూకెటగిరీ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.15వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. ఎద్దుల యజమానులు 6వ తేదీ సాయంత్రంలోగా రూ.600ల ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

8న ఆరుపళ్ల విభాగం

8న ఆరుపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని, విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.600ల ప్రవేశరుసుము చెల్లించి 7వతేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9704239966, 9989793455 నంబర్లు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, నానిరెడ్డి(మద్దిలేటిరెడ్డి) తదితరులు పాల్గొన్నారు.

జాతరలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తర్తూరు జాతరలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రూ.6లక్షల వ్యయంతో జాతరలో నూతన బోరును తవ్వించడంతో పాటు రెండు చోట్ల జీఎల్ఆర్ ట్యాంకులను నిర్మించి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే ఇదివరకు ఉన్న జీఎల్ ట్యాంకులను శుభ్రం చేయించి గ్రామంలోని బోర్ల నీటితో వాటని నింపుతామని చెప్పారు. వేలాది మంది భక్తులు వచ్చే జాతరలో తాగునీటి సమస్య రానివ్వకుండా ఉన్న నీటివనరులతో పాటు ఆరు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే దాతల సహకారంతో జాతరలో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



జాతరలో నూతనంగా నిర్మించిన జీఎల్ఆర్ ట్యాంకులు

గజవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీరంగనాథుడు



భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీరంగనాథ స్వామి

తర్తూరు శ్రీ లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం స్వామి వారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చెక్కబొమ్మ రూపంలో ఉన్న స్వామి వారికి పన్నీటితో స్నానం చేయించి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మహానైవేద్యం, మహామంగళహారతి వంటిపూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గజవాహనంతో అలంకరించిన ప్రభోత్సవ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, చైర్మన్ ప్రతాపరెడ్డి, ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు.

భూ ఆక్రమణలపై చర్యలు తప్పవు



ఉన్నవ నాగరాజుతో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: దేవదాయశాఖకు చెందిన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీ స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ ఏపీ ఎండోమెంట్స్ (ట్రిబ్యునల్ జోన్-4) ఉన్నవ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా మహానంది వచ్చారు. ఈసందర్భంగా ఆయన దృష్టికి నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో ఉన్న మహానంది దేవస్థానం భూమి ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తీసుకెళ్లారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మిడుతూరు: మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి (ఆరుపళ్ల విభాగం) బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు కాతా రమేష్‌రెడ్డి, ఒంగోలు జాతి పశుపోషకులు కాటం మురళీధర్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాలనుంచి 10 జతల ఎడ్లు పాల్గొనగా అలగనూరు గ్రామానికి చెందిన బీరం బుల్స్, రోలీ మేడం ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా డి. రంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు రెండో స్థానంలో రూ. 30వేలు, పాపిలి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి ఎద్దులు మూడో స్థానంలో రూ. 20వేలు, నంద్యాల జిల్లా బోయిలకుంట్ల గ్రామానికి చెందిన గిత్తుల సుభాన్ వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచి రూ. 15 వేలు గెలుచుకున్నాయి. పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన పల్లవి వృషభాలు ఐదవ స్థానంలో నిలిచి రూ. 10వేలు, కర్నూలు పట్టణం కృష్ణానగర్‌కు చెందిన మురళీ మోహన, వెంకటరామిరెడ్డి(కంబైన్ జత) వృషభాలు ఆరో స్థానంలో నిలువగా రూ. 6 వేలు నగదును ఎడ్ల యజమానులకు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమతం జయరామిరెడ్డి, ఎల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, వీరారెడ్డి, రాజశేఖరరెడ్డి, జ్ఞానేంద్రారెడ్డి పాల్గొన్నారు.



బండలాగుతున్న వృషభాలు

భూ రీ సర్వేపై అవగాహన

వెలుగోడు: సమగ్ర భూమి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గుంతకందాల, బోయరేవుల, అబ్దుల్లాపురం గ్రామాల్లో మంగళవారం భూమి రీ సర్వే గ్రామ సభ నిర్వహించి రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ అమానుల్లా, మండల సర్వేయర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

